ప్రజాశక్తి

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



బడ్జెట్‌పై తలపెట్టిన నిరసన కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, జెవి.సత్యనారాయణమూర్తి, లోకనాథం తదితరులు

ప్రజా వ్యతిరేకం.. కార్పొరేట్ అనుకూలం

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలో వి.శ్రీనివాసరావు, జెవి.సత్యనారాయణ మూర్తి

వార్త మెయిన్‌లో..

23న 16 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష

హాజరుకానున్న 11,029 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో గ్రూప్ - 2 పరీక్ష జరగనుందని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ విసి హాలులో జిల్లా అధికారులు, ఎపిపిఎస్‌సి అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎపిపిఎస్‌సి చైర్‌పర్సన్ ఎఆర్.అనురాధలు గ్రూప్ -2 పరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులతో మాట్లాడారు. పరీక్ష రెండు పూటలా జరుగుతుంది కాబట్టి దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు ముందు రోజే కేంద్రాలను చూసుకోవాలని, అక్కడ ఏర్పాట్లను పరిశీలించుకోవాలని సూచించారు. అన్ని విభాగాల మిగతా 2లో..

సాయంలో కోత

- భూధార్‌తో రైతుకు ముడిపెట్టిన కేంద్రం
- పలువురిలో ఆందోళన
- 24న మూడో విడత పిఎం కిసాన్ నిధులు జమ



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పిఎం కిసాన్ సాయం కోసం రైతులను కేంద్ర ప్రభుత్వం సుడుమడతలు పెడుతోంది. రెండు వేలు చొప్పున ఏడాదిలో మూడుసార్లు ఇచ్చే ఆరు వేల రూపాయలకు మురిపిస్తోంది. లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్యను కుదించాలని చూస్తోంది. ఇకెవైసి చేసుకోలేని రైతులకు పిఎం కిసాన్ డబ్బులివ్వని ప్రభుత్వం తాజాగా భూధార్ కార్డుకు ముడిపెట్టింది. భూధార్ కార్డు వున్న వారికే సాయం చేయాలనుకోవడంతో ఆ కార్డుల్లేని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2.50 లక్షల మంది రైతులున్నారు. వీరిలో ఇకెవైసి చేసుకున్న 1.97 లక్షల మంది రైతులకు పిఎం కిసాన్ సాయమందింది. 19వ విడత పిఎం కిసాన్ నిధులు జమచేసే నాటికి ఈ సంఖ్యను ఇంకా తగ్గించేందుకు మిగతా 2లో..

అథ్లెట్ జ్యోతికి ప్రోత్సాహకాలు

వార్త 3లో..

వీడిన హత్య కేసు మిస్టరీ..

వార్త 3లో..

'ఉక్కు' సమస్యలపై ఎంపీకి వినతి

వార్త 2లో..

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- పలుచోట్ల విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను కలిసి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నానని, అందరి సాధకబాధకాలు తెలుసునని అన్నారు. ప్రస్తుతం చట్టసభల్లో పేదలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించే వారు కరువవుతున్నారన్నారు. తాను గెలిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల వాణిని కౌన్సిల్‌లో బలంగా మిగతా 2లో..



ఉత్తరాంధ్ర జిల్లాల ఎఆర్‌ఒలతో ఏర్పాట్లుపై సమీక్ష జరుపుతున్న ఆర్‌ఒ హరేంధిర ప్రసాద్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

ఆర్‌ఒ హరేంధిర ప్రసాద్

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

సాయంలో కోత

భూధార్‌తో కేంద్రం లింకు పెట్టింది. వ్యవసాయాధికారుల సమాచారం ప్రకారం ఇప్పటివరకు లక్ష మంది రైతులకు భూధార్ కార్డులు అయ్యాయి. భూధార్ కార్డులు లేని 97 వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 24న కిసాన్ నిధులు జమచేస్తారా ? లేదా ? అనేది తెలియనుంది. కిసాన్ లబ్ధిదారుల జాబితా ఇంతవరకు జిల్లా వ్యవసాయశాఖకు రాకపోవడంతో లబ్ధిపొందే వారి సంఖ్యపై స్పష్టతలేదు. శనివారం నాటికి జాబితా వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సొంత భూమి కలిగిన రైతుల యాజమాన్య హక్కులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, అడంగల్ వంటి వాటితో ఎపి స్టేట్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదైన వివరాలతో సరిచూస్తున్నారు. ఏ మాత్రం తేడావున్నా భూధార్ కార్డు వచ్చే అవకాశంలేదు. అన్ని వివరాలూ సరిపోతే యునిక్ ఐడి జారీచేస్తున్నారు. ఇలా ఐడి జారీ అయిన వారిలో 2.50 లక్షల మంది రైతులకు లక్ష మంది వున్నారు. మిగిలిన వారికి ఐడిలు రావాల్సివుంది. ఐడిలు రాకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సాయం ఆగిపోతుంది. భూధార్ వీలైనంత త్వరగా పూర్తిచేసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. అన్నదాత సుఖీభవ సాయంలో కేంద్రం విధానాన్ని రాబోయే కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించనుందని తెలుస్తోంది. రైతుకు చేసే సాయంలో కోత పెట్టేందుకు భూధార్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ కింద రైతుకు రూ.20 వేలను కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సివుంది. కానీ ఇంతవరకూ చంద్రబాబు ప్రభుత్వం పైసా కూడా రైతుకు జమచేయలేదు.

23న 16 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష

అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని చెప్పారు. పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

గ్రేస్ పిరియడ్ తర్వాత వచ్చే వారికి అనుమతి లేదు

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రూప్ -2 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు పూటలా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు అనుమతించాలని, 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఉంటుందని చెప్పారు. ఉదయం 9.45 తర్వాత వచ్చే వారిని, మధ్యాహ్నం 2.45 తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో నిర్దేశించిన సమయానికి సిబ్బంది చేరుకోవాలని, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమంతించాలని చెప్పారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

చీఫ్ సూపరింటెండెంట్లు, ఎపిపిఎస్‌సి అధికారులు మినహా ఎవ్వరూ మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదని, సమీపంలోని జిరాక్స్ షాపులను మూసివేయించాలని చెప్పారు. వికలాంగులకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్న వారిని తనిఖీ చేసి అనుమతించాలని అన్నారు. వికలాంగులకు, గర్భిణులకు సాధ్యమైనంత మేరకు మొదటి అంతస్తులో కేంద్రం కేటాయించాలని చెప్పారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు బబ్లింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, కొట్టివేతలకు తావివ్వరాదని, వైటనర్ వినియోగించరాదని సూచించారు. ఒరిజినల్ ఒఎంఆర్ పత్రాన్ని ఇన్విజలేటర్‌కు అందజేసి, కిందనున్న డూప్లికేట్ పత్రాన్ని మాత్రమే అభ్యర్థులు తీసుకెళ్లాలని చెప్పారు. ఇన్విజలేటర్లు నిబంధనలు పాటించాలని, పరీక్షకు ఐదు నిమిషాల ముందు మాత్రమే సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్నా పత్రాలను ఇవ్వాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. మాస్ కాపీయింగ్ లేదా ఇతర సంఘటనలు జరిగాయని పేర్కొంటూ ఎలాంటి ఆధారం లేకుండా తప్పుడు వార్తలను, సమాచారాన్ని చేరవేసే వారిపై నిఘా ఉంటుందని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఎడిసిపి రాజ్ కమల్, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

వినిపించగలనని, పోరాడగలనని చెప్పారు. సిపిఎస్, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాప్‌ల రద్దుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు చిట్టయ్య, మోహన్, గాయత్రి, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు ఉన్నారు.

ఉల్లిపాయల ధర ఎందుకు పెరిగింది ?

- వ్యాపారులను ప్రశ్నించిన జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు ఉల్లిపాయలు ధరలు కిలోకు రూ.19 అధికంగా ఉన్నాయని, దీనికి కారణం ఏమిటని హోల్ సేల్ వర్తకులను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రశ్నించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ధరల నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కూరగాయల్లో అన్ని తక్కువ రేట్లకే ఉన్నాయని, ఉల్లిపాయల ధర మాత్రం గత సంవత్సరంతో పోలిస్తే రూ.19 ఎక్కువగా ఉందని గమనించానన్నారు. దీనిపై వర్తకులు సమాధానమిచ్చారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డిఎస్ఒ ఇన్చార్జి, ఉద్యానవన అధికారి, 13 రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, జ్ఞానాపురం, గాజువాక హోల్ సేల్ వర్తకులు పాల్గొన్నారు.

'ఉక్కు' సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ శ్రీభరత్‌కు సమస్యలను వివరిస్తున్న డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతనాలు, టౌన్‌షిప్‌లోని విద్యా సంస్థలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చాలంటూ విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు గురువారం వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించినప్పటికీ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల చెల్లింపుల సమస్య నేటికి పరిష్కారం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించేలా, ఫిబ్రవరి మాసం నుంచి వేతనాలు రెగ్యులర్‌గా ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. హెచ్‌ఆర్‌ఎ చెల్లించాలని, క్వార్టర్స్‌కు ఏకపక్షంగా పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరారు. రిటైర్డ్ అయిన వారిపై గ్రూపు మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం అధిక భారం మోపే చర్యలు ఉపసంహరించేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో మొదటి, 11వ తరగతుల అడ్మిషన్లు రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్రీయ విద్యాలయ సంస్థకు తెలియజేసినట్లు తెలిసిందని, గత ఏడాది కూడా ఇదే వైఖరి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకోగా కార్మిక సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనతో వెనక్కి తగ్గి అడ్మిషన్లు పునరుద్ధరించిందని గుర్తుచేశారు. ఇప్పుడు మరలా ఆ ప్రమాదం ముందుకొచ్చిందన్నారు. ఆరు నెలల నుండి కేంద్రీయ విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు. వెంటనే జోక్యం చేసుకొని కెవి స్కూల్‌లోని తరగతులు మూసివేయనీయకుండా మొదటి, 11వ తరగతికి అడ్మిషన్లు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టౌన్‌షిప్‌లో ఉన్న విశాఖ విమల విద్యాలయ సంస్థకు కూడా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా, ఆరు నెలల నుండి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేస్తోందన్నారు. ప్రస్తుతం స్కూల్ అడ్మిషన్ల సమస్య కూడా ముందుకొచ్చిందన్నారు. సమస్యను వెంటనే పరిష్కారం చేసి స్కూల్ కొనసాగేలా, ఉపాధ్యాయుల వేతన బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నెలవారీ వేతనాలు సక్రమంగా చెల్లించేలా, స్కూల్ ఫీజులు పెరగకుండా చూడాలన్నారు. టౌన్‌షిప్‌లో మరో ముఖ్యమైన విద్యా సంస్థ డిఎవిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. పెరిగిన డిఎతో కలిపి తక్షణం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం కేంద్ర ఉక్కు శాఖ మంత్రితోనూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతోనూ చర్చలు జరిపి పై సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని, శాంతి భద్రతల సమస్య రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి జిల్లా ఎఆర్‌ఒలను రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి లోపాలూ తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలూ సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, జవాబుదారీతనం ఉండేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. వారికి స్థానిక అధికారులు తగిన వసతి కల్పించాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని, తాగునీరు, ఆహారం అందజేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారు.

పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రక్రియకు సంబంధించిన సమాచారం చేరవేతలో జాగురూకతతో వ్యవహరించాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సమావేశానికి హాజరైన ఎఆర్‌ఒలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. వారు చేపడుతున్న చర్యల గురించి తెలిపారు. విశాఖపట్నం ఎఆర్ఒ బిహెచ్ భవానీ శంకర్, అల్లూరి సీతారామరాజు ఎఆర్ఒ పద్మలత, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఎఆర్‌ఒలు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఉద్యోగుల

పెన్షన్ సవరణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఉద్యోగుల మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించాలని, పెన్షన్ రివిజన్‌తో పాటు 4జి, 5జి సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని బిఎస్‌ఎన్‌ఎల్ ఎఐబిడిపిఎ అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి జిఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. విశాలాక్షినగర్‌లోని విజయ జ్యోతి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరగాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు పదేళ్లకోసారి వేతన సవరణ జరగాల్సి ఉన్నా 17 ఏళ్లుగా జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత ఎనిమిదేళ్ల నుంచి పెన్షన్ రివిజన్ జరగక పోవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కోర్టుల్లో కేసులు సాకుగా చూపించి, పెన్షన్ సవరణను నిరాకరిస్తుందని తెలిపారు. పెన్షన్ సవరణ జరగక పోవడంతో లక్షలాది మంది పెన్షనర్ల కుటుంబాలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అనువైన పరిస్థితులున్నా 4జి, 5జి సేవలు బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ వినియోగదారులకు విస్తరించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

ఎఐబిడిపిఎ జిల్లా అధ్యక్షులు గోవిందరావు మాట్లాడుతూ, బిఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఉద్యోగులకు సిజిహెచ్ఎస్ నుంచి క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు అనుమతించాలని పాత పెన్షన్ స్కీమ్‌ను పునః ప్రారంభించాలని, పెన్షనర్ల మరణానంతరం 10 ఏళ్ళ పూర్తి కుటుంబ పెన్షన్ ఉండాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జిఎఫ్.ఫ్రాన్సిస్, పి.వి.రమణ, ఎ.ఎన్.హనుమంతురావు, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోనిలో ఆంజనేయస్వామి గుడి వద్ద విద్యుత్ స్తంభాన్ని గురువారం లారీ ఢీకొనడంతో అది విరిగి నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 11 కెవి విద్యుత్ వైర్లు నేలకొరగడంతో సిర్లపాలెం, పేకేరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు స్తంభం విరిగిందన్న సమాచారం అందుకున్న లైన్‌మ్యాన్ మహేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. లారీ యాజమాన్యంతో మాట్లాడి, విద్యుత్ వైర్లను సరిచేశారు.

గంటల వ్యవధిలో బాలిక ఆచూకీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో తప్పిపోయిన బాలిక ఆచూకీని గంటల వ్యవధిలో కనిపెట్టి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఒక బాలిక తప్పిపోయినట్లు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించారు. టెక్‌సెల్, సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గంటల వ్యవధిలో సదరు బాలిక ఆచూకీని కనిపెట్టారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. గోపాలపట్నం పోలీసులను కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2023లో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయికి స్థానిక కోర్టు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావు గురువారం తెలిపారు. ఎస్ఐ సూర్యప్రకాశ రావు కథనం ప్రకారం... తగరపువలసలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వి.నరసింహరాజు ఇంట్లోకి రాత్రి వేళ కిటికీ మార్గం గుండా ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు లక్ష రూపాయలు దొంగిలించిన కేసులో విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, గొండయ్యపాలెం గ్రామానికి చెందిన ఎర్నింటి కృష్ణబాబు (22)ను పోలీసులు అరెస్టుచేశారు. కేసు విచారణ అనంతరం స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థికి సైకిల్ వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ముగడ చైతన్యకు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవిటి.రత్నం రూ.5,400 విలువైన సైకిల్‌ను గురువారం పాఠశాలలో అందజేశారు. మండలంలోని కంచేరుపాలెం గ్రామం నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థి చైతన్య కాలినడకన పాఠశాలకు వస్తుండడాన్ని గమనించి ప్రధానోపాధ్యాయులు తన సొంత నిధులతో సైకిల్‌ను కొని అందించారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

జిమ్‌సర్ 'సిపిఆర్ శిక్షణ'

ప్రజాశక్తి -మధురవాడ : గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు అత్యవసర పరిస్థితులలో హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం (సిపిఆర్) ద్వారా ఎలా సహాయ పడవచ్చో తెలియ జేయడానికి, ప్రతి ఒక్కరు సకాలంలో స్పందించి ప్రాణదాతలుగా నిలవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఎమర్జెన్సీ మెడిసిన్ ఎస్‌బిఎమ్ఇ విభాగం రికార్డు స్థాయిలో 900 మందికి శిక్షణ ఇచ్చిందని విభాగాధిపతి డాక్టర్ దివ్యబన్సా వెల్లడించారు. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా వైద్యులతో పాటు అంబులెన్సు డ్రైవర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్ ప్లాంట్ సిబ్బంది, ఫార్మసీ, ఆతిథ్యవిభాగం, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది, విద్యార్థులకు దశల వారీగా ఈ శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. మరో 900 మందికి రానున్న రోజులలో ఈ శిక్షణ అందిస్తామన్నారు. డాక్టర్ స్వర్ణలత, దివ్యజానీల పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా సిపిఆర్‌పై పెద్ద సంఖ్యలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడాన్ని జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి అభినందించారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయాలని, దీనిపై మరి కొంత మందికి అవగాహన కల్పించాలని సూచించారు.

పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి బిఎన్ఆర్.నగర్‌లోని పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరి గోవిందు, మద్దిల రాజశేఖర్, గాడు అప్పలనాయుడు, టిడిపి నాయకులు కేతా సత్యనారాయణ, బలగ సుధాకర్, మాణిక్యాలరావు, కొండమ్మ, మామిడి మోహన్, ఒమ్మి పోలారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

అథ్లెట్ జ్యోతికి ప్రోత్సాహకాలు : గంటా



ఎమ్మెల్యే గంటాను కలిసిన అథ్లెటిక్ జ్యోతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించిన అర్జున అవార్డు గ్రహీత మండలంలోని మజ్జిపేటకు చెందిన ఎర్రాజి జ్యోతికి ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ప్రోత్సాహకాలు అందేలా తన వంతు కృషిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం కంచరపాలెంలో కుటుంబంతో కలిసి ఉంటున్న ఆమె నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉంటున్న ఎమ్మెల్యే గంటాను గురువారం కలిశారు. తాను పాల్గొన్నున్న పలు పోటీల వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి రికార్డులు నెలకొల్పిన ఆమె ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గత నెలలో ఆమెకు అర్జున అవార్డును అందజేసిన విషయం విదితమే. ఆమె తండ్రి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు.

ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న తనకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందేలా చూడాలని ఆమె కోరారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, నగదు బహుమతి దక్కేలా చొరవ తీసుకోవాలని జ్యోతి కోరగా, అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అర్జున అవార్డు గ్రహీతలకు నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని గంటా చెప్పారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో మాట్లాడతానని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు నెలకొల్పి దేశానికి, మన రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, కార్పొరేటర్ పి.వి.నరసింహం, టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో 'కేథరిన్' వార్షికోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం మూలకుద్దు 'కేథరిన్' పాఠశాల 41వ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన, ఐక్య రాజ్య సమితి సమావేశాల నిర్వహణ నమూనా ప్రదర్శించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. జివిఎంసి ఒకటో జోన్, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాలుపంచుకునేలా ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్లు పేర్కొంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనేలా ఆహ్వానాలు పంపించినట్లు తెలిపింది. 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు డిఇఒ ఎస్.ప్రేమ్‌కుమార్ వేడుకలను ప్రారంభించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు ముగింపు సభలో భారత ప్రభుత్వ ఎస్‌టిపిఐ అడిషనల్ డైరెక్టర్ సురేష్ బాత్, ఎన్ఎస్‌టిఎల్ అడిషనల్ డైరెక్టర్, సైంటిస్ట్ రెగివ అభిషేక్ రాజ్ హాజరు కానున్నారని పాఠశాల కరస్పాండెంట్ ఆలివర్ రాయి తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు

వీడిన హత్య కేసు మిస్టరీ..

అసభ్య ప్రవర్తనతోనే అప్పన్నదొర హత్య

అరెస్టయిన దంపతులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ ప్రైవేట్ లే-అవుట్‌లో బుధవారం గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి హత్యకేసుకు సంబంధించి మిస్టరీ వీడింది. హత్యకు దారి తీసిన కారణాలు, హత్యకు పాల్పడింది దంపతులు అని పోలీసుల విచారణలో వెల్లడైంది. సిఐ సుధాకర్ కథనం ప్రకారం... అందిన సమాచారం మేరకు గురువారం ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. జివిఎంసి నాలుగో వార్డు నేరెళ్లవలస గ్రామానికి చెందిన ఉళ్ల చిన్నారావు, భార్య గుడ్డాల మౌనిక నెల రోజుల క్రితం ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఎల్‌వి.పాలెంలో అద్దెకు ఇంట్లో దిగారు. వారుంటున్న ఇంటికి దగ్గర్లో టీ దుకాణం నడుపుతున్న ఎడ్ల తిరుపతమ్మతో చిన్నారావు, మౌనికలకు పరిచయం ఏర్పడింది. జ్యోతిష్కునిగా ఉన్న పెందుర్తి బిసి కాలనీకి చెందిన మోతి అప్పన్నదొర టీ దుకాణానికి ప్రతి ఆది, మంగళ వారాల్లో వచ్చి వెళ్తుంటాడు. తనకు కొన్ని సమస్యలున్నాయని టీ దుకాణం నిర్వాహకురాలు తిరుపతమ్మకు మౌనిక చెప్పింది. కుటుంబ, వాస్తు తదితర సమస్యలకు అప్పన్నదొర పూజల ద్వారా ఉపశమనం కలిగిస్తారని మౌనికకు తిరుపతమ్మ చెప్పింది. ఇదే విషయాన్ని అప్పన్నదొరకు కూడా చెప్పింది. అప్పన్నదొర మౌనిక ఇంటికి వెళ్లి పూజలు చేస్తానని చెప్పి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా బలవంతం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే కుటుంబాన్ని నాశనం చేస్తానని బెదిరించాడు. భార్య మౌనిక జరిగిన విషయాన్ని భర్త చిన్నారావుకు చెప్పింది. ఘటనపై కోపం పెంచుకున్న దంపతులు అతన్ని చంపేందుకు పథకం రచించారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం బటన్ నైఫ్, ద్విచక్ర వాహనంతో సిద్ధమైన చిన్నారావు తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని రూ.7 వేలు ఇస్తానని చెప్పి ద్విచక్ర వాహనంపై జ్యోతిష్కుడిని ఆనందపురం నుంచి భీమిలి క్రాస్ రోడ్డు, బోయిపాలెం గుండా జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడలోని ప్రైవేట్ లే-అవుట్‌లోకి తీసుకెళ్లాడు. జ్యోతిష్కుడు అప్పన్న దొరను వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో చిన్నారావు కుడి చేతి చూపుడు వేలుకు గాయమైంది. కెజిహెచ్‌లో చికిత్స పొందిన అనంతరం మరలా మంగళవారంతెల్లవారు ఝామున నాలుగు గంటలకు తన ఇంట్లో ఉన్న రెండు లీటర్ల టిన్నర్‌తో పాటు మరో రెండు లీటర్ల పెట్రోల్‌ను కొని అదే రోజు ఉదయం 6 గంటలకు భార్య మౌనికతో కలిసి జ్యోతిష్కుని మృతదేహంపై పోసి నిప్పంటించి ఆనవాళ్లు లేకుండా చేద్దామని స్కెచ్ వేశారు. తన భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడని హత్య చేసిన చిన్నారావును, నేరంలో సహకరించి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు సహకరించిన అతని భార్య మౌనికను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి బటన్ నైఫ్, రక్తపు మరకలు కలిగిన ముద్దాయి జీన్ ప్యాంటు, హత్యకు గురైన జ్యోతిష్కుడు అప్పన్న ఫోన్ పౌచ్, లైటర్, పల్సర్ బైక్, కీ పాడ్ మొబైల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి పేర్కొన్నారు. వెల్లంకి గ్రామంలో గృహ నిర్మాణాలను గురువారం ఆమె పరిశీలించారు. మండలంలో మంజూరైన 2684 గృహాలలో 1219 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని లబ్ధిదారులందరూ పూర్తి చేయాలని కోరారు. ఇంజినీరింగ్ సహాయకులు ఈ నెల 25వ తేదీలోగా స్టేజ్ అప్డేషన్స్ పూర్తి చేసి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం, మజ్జిపేట గ్రామాల్లో మధ్యలో నిలిచిన కమ్యూనిటీ టాయిలెట్ల పునర్నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ ఈశ్వరీభాయ్, ఎఇ ఎస్.దుర్గాభవానీతో కలిసి ఎస్ఇఇ ఎవిఐ.చౌదరి గురువారం పరిశీలించారు. వీలైనంత త్వరగా కమ్యూనిటీ టాయిలెట్ల పునర్నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో మండలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిఇఇ, ఎఇలను ఆదేశించారు. పలు గ్రామాల్లో తాగు నీటి నిల్వ నిమిత్తం సోప్ పిట్లు ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. 16 పంచాయితీల్లో 59 గ్రామాల్లో సుమారు 60 సోప్ పిట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎఇ దుర్గా భవానీ తెలిపారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి -మునగాడ: 2025 -26 కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, సామాన్య ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేసిందని ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య కె.పద్మ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన కేంద్ర బడ్జెట్‌పై సదస్సు నిర్వహించారు. సదస్సు ముఖ్య అతిథిగా పద్మ హాజరై మాట్లాడుతూ, నిరుద్యోగం, తక్కువ వేతనాలు, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలకు ఈ బడ్జెట్ పరిష్కారాన్ని సూచించలేదన్నారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి వంటి ముఖ్యమైన రంగాలకు తగిన నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ బడ్జెట్ అసమానతలను పెంచేదిగా ఉందన్నారు. ధనవంతులకు సంపద పన్నును విధించాలని డిమాండ్ చేశారు. గౌరవ అతిథి బొట్ట నర్సింగరావు ఫౌండేషన్ సభ్యులు ఎం.సుజాత మాట్లాడుతూ, బడ్జెట్ పేదల జీవితాల్లో వెలుగులు నింపేదిగా ఉండాలన్నారు. ఆత్మీయ అతిథి, బొట్ట నర్సింగరావు ఫౌండేషన్ సభ్యులు బుజ్జి మాట్లాడుతూ, విద్యార్థినులు సామాజిక అంశాలపై, దేశంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, అర్థశాస్త్ర అధ్యాపకులు బిపి.రాజు, విద్యార్థినులు, జాతీయ సేవా పథక కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం : ఎపిఇపిడిసిఎల్ జోన్-2 డివిజన్ కెబిఆర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఇఇ బికె.నాయుడు తెలిపారు. కెబిఆర్ ఫీడర్ పరిధిలోని శాతవాహననగర్ రోడ్డు నెంబర్ 1 నుంచి 9 వరకు, ముస్తాఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటిఐ రోడ్డు, గౌరీనగర్, యాతపాలెం, అశోక్‌నగర్, శివాజీనగర్, ఆల్ ఇండియా రేడియో, శివసాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ : మధురవాడ సబ్ స్టేషన్ 11కెవి శివశక్తి నగర్ ఫీడర్‌పై మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్-3 డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శివశక్తి నగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, గణేష్ నగర్, శ్రీలక్ష్మి నగర్, అయ్యప్పనగర్, ముత్యాలమ్మ కాలనీ, స్వయంకృషి నగర్, వైఎస్ఆర్.కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీపాద డిగ్రీ కాలేజీలో రక్తదానం

ప్రజాశక్తి-మాధవధార : మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కాలేజీ, ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యాన కాలేజీ సెమినార్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాలేజీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను కాలేజీ ప్రిన్సిపల్ డి.రాజేష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీకాంత్, యుబిఎ కో-ఆర్డినేటర్ పి.కార్తీక్ అందజేశారు. రక్తదానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఎఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కె.అరుణ, ఎ.సుగంధి వివరించారు. యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో అవగాహన కల్పించారు.

ముగిసిన వైకల్య నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని వివిధ కేటగిరీల్లో ఉన్న 392 మంది వికలాంగులకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన సదరం ధ్రువీకరణ పత్రాల పున:పరిశీలన కేంద్రంలో మూడురోజులుగా జరిగిన వైద్య నిర్ధారణ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 18, 19, 20 తేదీల్లో రోజుకు వంద మందికి చొప్పున వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. గురువారం అన్నవరం, అమనాం, దాకమర్రి, లక్ష్మీపురం గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న వంద మందికి వైద్యులు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎండిఒ ఎన్.హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల

'మెడికల్' యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ సౌకర్యం యథావిధిగా కొనసాగించాలని ఉక్కు రిటైర్డ్ ఉద్యోగులు, అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. సుమారు 300 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకొని నినదించారు. ఈ సందర్భంగా స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సభ్యులు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉక్కు యాజమాన్యం ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులకు ఉన్న జిఎంపి స్కీమ్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్లాంట్ ఉత్పత్తి కోసం సుమారు 40 సంవత్సరాలు కష్టపడి పనిచేసిన రిటైర్డ్ కార్మికులు రూ.1500 నుండి రూ.2500 పెన్షన్ పొందుతున్నారని, అటువంటి సమయంలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆదుకోవాల్సిన యాజమాన్యం ఉన్న సదుపాయాలను తొలగించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఆ స్థానంలో ప్రస్తుతం ఏటా చెల్లించాల్సిన ప్రీమియం రూ.1300 స్థానంలో రూ.10 వేలుకు పెంచే ప్రయత్నం చేస్తుందని, రూ.8 వేలు ఒపిటిని రూ.4 వేలుకు కుదించే ప్రయత్నం చేస్తుందన్నారు. దీన్ని రిటైర్డ్ ఉద్యోగులతోపాటు అన్ని కార్మిక సంఘాలూ తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్లు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు దీనబంధు, పి.పెద్దిరాజు, డి.ఆదినారాయణ, ఎం.ఎ.మాధవరావు, ఎస్.బాలభాస్కర రావు, ఎస్.రామారావు, కోరాడ అప్పారావు, కృష్ణారావు, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జె.అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు. రామస్వామి, విళ్ల రామ్మోహన్‌కుమార్, బొడ్డు పైడిరాజు, సన్యాసిరావు, కామేశ్వరరావు, పరంధామయ్య, దాసరి సురేష్ మాట్లాడారు. అనంతరం సిజిఎం హెచ్ఆర్ గాంధీకి వినతిపత్రం అందించారు.




ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు

ప్లాంట్ యంత్ర సామర్థ్యం పెంచాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వైటి.దాస్

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న యంత్ర సామాగ్రి సామర్థ్యాన్ని అంచనా వేయకుండా యాజమాన్యం అనాలోచితంగా ఉత్పత్తి సామర్థ్యం పెంచాలని ప్రయత్నించడం సరికాదని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వైటి.దాస్ పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1470వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి వైటి.దాస్ మాట్లాడుతూ, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన పరిస్థితులను యాజమాన్యం అంచనా వేసి ప్రభుత్వానికి వివరించి, అవసరమైన నిర్ణయాలను తగిన సమయంలో తీసుకోవాలని సూచించారు. అలాకాకుండా పూర్తిస్థాయి ఉత్పత్తి చేయాలన్న తొందరలో నిర్ణయాలు తీసుకుంటే గతంలో ఎస్ఎంఎస్-2లో జరిగిన ప్రమాదమే పునరావృతమై కార్మికులు, అధికారుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని గుర్తించాలన్నారు. ప్రమాదాలను గుర్తించి, నివారించగలిగే వారిని నేడు విఆర్ఎస్ పేరుతో కర్మాగారం దూరం చేసుకుంటుందన్నారు. యాజమాన్యం తొందరపాటు నిర్ణయాలను విస్మరించి, పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, కార్మికులు, అధికారుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతలు పెరుగుతాయన్న చిన్న విషయాన్ని యాజమాన్యం విస్మరించడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లిస్తూ, వారికి గల సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.గంగాధర్, యు.మరిడయ్య, పి.భానుమూర్తి, కె.సత్యనారాయణ, వి.ప్రసాద్, రమణమూర్తి, జగ్గారావు, కృష్ణార్జున, గౌరీశంకర్, మధు, కె.శ్రీనివాస్‌రెడ్డి, రామనర్సింగరావు, నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



గెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

గెడ్డంతా ప్లాస్టిక్ వ్యర్థాలే...

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి విశ్వేశ్వరాయనగర్ నుంచి భరత్‌నగర్‌కు వెళ్లే గెడ్డ ప్లాస్టిక్‌తో నిండిపోయింది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు విపరీతంగా పేరుకుపోయాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో గెడ్డలో నీరు ప్రవహించలేక నిల్వచేరింది. దీంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక ప్రజలు ఈ దుర్వాసనను భరించలేకపోతున్నారు. దీనికి తోడు దోమలు, ఈగలు ప్రబలుతున్నాయి. గత కొంతకాలంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంలో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ సూచించారు. సెంటర్ ఫర్ పాలసీస్టడీస్, పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా పౌరగ్రంథాలయంలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డిసెమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ఎవరైనా ఏరంగంలోనైనా సక్సెస్ అవ్వాలంటే ముందుగా కష్టపడటానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. చివరి వరకు పోరాడుతూ ఉండాలని చెప్పారు. మనలోని లోపాలను ఎవరైనా చెబితే ఆ బలహీనతలను సరిదిద్దుకొని విజయాలను అందుకోవాలని సూచించారు. వ్యక్తిగత క్రమశిక్షణతోనే సమాజంలో మంచి మార్పు వస్తుందన్నారు. ముందుగా గ్రంథాలయంలోని అన్ని విభాగాలను, పుస్తకాలను, ఉద్యోగార్థులకు కల్పించిన సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మియావాకీ చిన్న పిల్లల విభాగంలో కథకులు సీతా శ్రీనివాస్ పిల్లలకు కథ చెబుతున్న కార్యక్రమంలో భరత్ పాల్గొని అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, పౌరగ్రంథాలయం కార్యదర్శి డిఎస్.వర్మ, కోశాధికారి కెవి.గుప్త, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో విభాగాలను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్

నర్సింగ్ విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి-పెందుర్తి: ఇందిరా నర్సింగ్ హోమ్‌లో ఆహార కల్తీతో అస్వస్థతకు గురై పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు గురువారం పరామర్శించారు. వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు దివ్యతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు విద్యార్థినుల పరిస్థితి మెరుగ్గానే ఉందని, ఇద్దరిని కెజిహెచ్‌కు పంపించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.అరుణ, ఎన్.అరుణ, హరీష్, నాగేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై నిరసన

సిఐటియు ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - పరవాడ

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపడాన్ని నిరసిస్తూ గురువారం పరవాడ సినిమాలు జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేస్తుందన్నారు. ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.86 వేల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కూడా 86 వేల కోట్లు రూపాయలు కేటాయించిందని తెలిపారు. కనీసం ఐదు శాతం పెంచి సుమారు రూ.90 వేల కోట్లు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా పక్కన పెట్టారని, విభజన చట్ట ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకు కేటాయింపులు చేయలేదని తెలిపారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిబుల్ ఐటి, ఐఐఎస్ఇఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణ నిధులు ఊసే లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కేంద్రం పూర్తిగా విస్మరించిందని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. మరోవైపు వైజాగ్ స్టీల్ ప్లాంటకు గత ఏడాది కంటే రూ.5327 కోట్లు తగ్గించిందన్నారు.



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహంపై ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.నాయుడు, బి లచ్చిబాబు, కే అప్పారావు, జి శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

విలేకరిపై దాడి సరికాదు

- టిడిపి నేతపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మునగపాక : పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన ఆ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాల నాయుడు పై కఠిన చర్యలు తీసుకోవాలని మునగపాక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మల్ల రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విలేకరులతో కలిసి గురువారం ఆయన తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎస్సై ప్రసాదరావులకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాసి ప్రజల ముందుకు వార్తలు చేరవేసే జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదన్నారు. విధుల్లో ఉన్న ప్రజాశక్తి విలేఖరి రామారావుపై దాడి చేసి గాయపరచడమే కాకుండా ఇంటికి వచ్చి నిన్ను చంపుతానని బెదిరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అధికార మదంతో జర్నలిస్టులపైనే దాడి జరిగిన తీరు చూస్తే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రెస్ క్లబ్ సభ్యులు వెలగా జగదీష్, సబ్బి కృష్ణ, కర్రి భాస్కరరావు, ఆడారి శ్రీనివాసనాయుడు ఉన్నారు.

ఇంద్రజిత్ గుప్తాకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మాజీ హోం శాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా వర్ధంతి కార్యక్రమం సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగింది. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు ఇంద్రజిత్తు గుప్తా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సార్లు సిపిఐ పక్షాన పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైన గుప్తా నిరంతరం ప్రజల పక్షాన నిలబడ్డారని తెలిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు పొందారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వీరాచారి, బి. బాబ్జి, సత్యనారాయణ, పోతురాజు, శంకర్రావు, గురుబాబు, సూరిబాబు, బుజ్జి, సత్తిబాబు, జీవి రావు, సింహాద్రి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌పి తుహిన్ సిన్హాను సత్కరిస్తున్న మధుబాబు తదితరులు

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హాకు జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు విజ్ఞప్తి చేశారు. కె.కోటపాడు విచ్చేసిన అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను మధుబాబు, కె.కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవానిగురయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ఇన్చార్జ్ మల్లవరపు లోవచంద్ గురువారం కలిసారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ కేసులపై, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కులాంతర ప్రోత్సహించే విధంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో విచారణ పేరుతో కాలయాపన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైతే కేసులు పెడుతున్నారో ఆ బాధితులే స్టేషన్లో చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ బాధితులకు పోలీస్ స్టేషన్లలో కనీసం గౌరవం దక్కడం లేదన్నారు. తక్షణమే జిల్లాలో ఎస్సీ ఎస్టీ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎస్పీని సాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో కె.కోటపాడు సీఐ డి.లక్ష్మీనారాయణ, ఎస్ఐ రాజాన ధనుంజయ్, నాయకులు అప్పారావు, అడ్వకేట్ జే.మహేశ్వరరావు, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి రూ.5 కోట్లు విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకాంబిక ఆలయానికి రూ.5 కోట్లు విడుదలయ్యాయి. టిడిపి ప్రభుత్వం హయాంలో 2015లో నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లి నూకంబిక అమ్మవారి ఆలయానికి విచ్చేసి ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.5 కోట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా మంజూరు చేశారు. ఈ మొత్తం రాకుండా కొంతమంది కోర్టు ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసారు. ఎట్టకేలకు నేటి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవతో పదేళ్ల తర్వాత కోర్టు తీర్పు ద్వారా నేడు అమ్మవారి ఆలయానికి వడ్డీతో సహా తిరిగి మంజూరు చేశారు.

లోవోల్టేజ్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి కోమటి వీధి, గెడ్డం వీధి, బ్రాహ్మణ వీధుల్లో లోవోల్టేజ్ సమస్య పరిష్కారమైంది. గతంలో లోవోల్టేజ్ సమస్యతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.6,96,915 నిధులు మంజూరు చేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో వోల్టేజ్ సమస్య పరిష్కారమైంది. ఈ మేరకు బర్ల రమణ, గెడ్డం రమేష్, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, జెట్టి ప్రసాద్ తదితరులు ఎపిఈపిడిసిఎల్ ఎఈ అశోకకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి



ఎల్ఐసి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


ప్రజాశక్తి-అనకాపల్లి

అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గురువారం అనకాపల్లి ఎల్ఐసి ఆఫీస్ కార్యాలయం వద్ద 3, 4 తరగతుల ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి 1 గంట వాక్అవుట్ సమ్మె చేశారు. ఎల్ఐసిలో 3, 4 తరగతి ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మెజారిటీ యూనియన్ ఏఐఐఈఏకు ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఇవ్వాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భర్తీ జరగక పోవడం వలన ఉన్న ఉద్యోగులపై పని భారం పెరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌డిఏ ఇటీవల తీసుకున్న నిర్ణయాలు ఎల్ఐసి వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగులు హాజరై సమ్మెకు మద్దతు తెలియచేసారు. ఈ సమ్మెకు ఐసీఈయూ రూరల్ అధ్యక్షులు జేఎన్ శాస్త్రి, కార్యదర్శి శ్రీనివాస్ నాయకత్వం వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం

రానున్న రోజుల్లో వైసిపి ఆధ్వర్యంలో ప్రజల తరపున పోరాటం చేస్తామని ఆ పార్టీ యూత్ వింగ్ జిల్లా అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్ తెలిపారు. వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సిపి యూత్, స్టూడెంట్, ఇంటెలెక్చువల్ విభాగాలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీలో యువకుల పాత్ర అనే అంశంపై సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడినట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి తాము కృషి చేస్తామన్నారు. యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను సన్మానించినట్లు వెంకటేష్ తెలిపారు.


జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న పుల్లేటి వెంకటేష్

పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న రామ సదాశివరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, రైతు సంఘం నాయకులు కె.రామ సదాశివరావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో పంచాయతీ కార్మికుల సమస్యలపై సిఐటియు మండల కన్వీనర్ కే.సోమ నాయుడు అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము, రామ సదాశివరావు మాట్లాడుతూ 25 సంవత్సరాలు పైబడి ఎండకు ఎండి వానకు తడిసి గ్రామపంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న వారికి చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.15వేలు ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పిఎఫ్, సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలని, పనిలో ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం వైద్య సేవలు అందించాలని, గ్లౌజులు, బూట్లు, మాస్కులు, నూనె, సబ్బులు, పనిముట్లు నాణ్యమైనవి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి చోడవరం

పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ శ్రీధర్ అన్నారు. మండలంలోని రాయపురాజుపేట రామాలయం వద్ద వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో వివిధ రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కొండెంపూడి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్ కుమార్ మాట్లాడుతూ అపరాలలో మేలైన రకాలు, కొత్త వంగడాలను వచ్చే సీజన్లో చిరు సంచుల రూపంలో కొంతమంది అభ్యుదయ రైతులకు అందిస్తామని తెలిపారు. శాస్త్రవేత్త సౌజన్య మాట్లాడుతూ ఆసక్తిగల 20 మంది రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి వారికి విత్తనం నుండి పంట కోత దశ వరకు జరిగే అన్ని దశలలోనూ ఉచితంగా ఇన్పుట్స్ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడిఏలు సుబ్రహ్మణ్యం, ఝాన్సీలక్ష్మి, ఏవో వి.తులసిమణి, చోడవరం సబ్ డివిజన్ ఏడిఏ రవీంద్రనాథ్, ఏవో పావని, విస్తరణాధికారులు కిరణ్, లక్ష్మణ్, రాయపురాజుపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ శ్రీధర్

ప్రైవేటు కళకళ.. సహకారం వెలవెల

- రోజుల తరబడి కాటాల వద్దే నిలిచిపోతున్న చెరుకు
- ఎండిపోతున్నా పట్టించుకోని గోవాడ సుగర్స్ యాజమాన్యం
- ప్రతిరోజు 300 టన్నుల వరకు ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలిపోతున్న వైనం



బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద నిలిచిపోయిన చెరకు బండ్లు



ప్రైవేటు ఫ్యాక్టరీకి చెరుకు తరలింపునకు రాజాం వద్ద లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

జిల్లాలో మూడు సుగర్ ఫ్యాక్టరీలు మూతపడగా, నడుస్తున్న గోవాడ చక్కెర కర్మాగారం క్రషింగ్ చేయడానికి ఆపసోపాలు పడుతోంది. ఈ ఏడాది అసలే క్రషింగ్ ఆలస్యంగా ప్రారంభించగా, ఈ నెల రోజుల్లో సగం రోజులు మరమ్మతులకే పోయాయి. దీంతో ఈ ఫ్యాక్టరీని నమ్ముకొని రైతులు కాటాల వద్దకు తెచ్చిన చెరుకు రోజుల తరబడి ఉండిపోయి ఎండిపోతుంది. మరో వైపు ప్రైవేటు ఫ్యాక్టరీలకు రోజుకు పదుల సంఖ్యలో లారీలతో చెరుకు తరలిపోతుంది.

సహకార రంగంలో నడుస్తున్న గోవాడ ఫ్యాక్టరీకి వారసత్వంగా వస్తున్న షేరు హోల్డర్లు ద్వారా చెరుకు సరఫరా అవుతోంది. అయితే గోవాడ చక్కెర కర్మాగార యాజమాన్యం తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ల మాసాల్లో ప్రారంభమయ్యే చెరుకు ఫ్యాక్టరీ ఈ ఏడాది కాస్త జనవరి 21వ తేదీన క్రషింగ్ ప్రారంభమైంది. ఈ నెల రోజుల్లో సగం రోజులు మరమ్మతులకే పోయాయి. దీంతో రైతులు తీసుకువచ్చిన చెరకు కాటాల వద్దే ఎండిపోతుంది. అయినా యాజమాన్యం మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

గోవాడ చక్కెర కర్మాగారం పరిధిలో అన్ని కాటాల కంటే బుచ్చయ్యపేట చెరుకు కాటా ద్వారా ఫ్యాక్టరీకి ఎక్కువ చెరకు సరఫరా అవుతూ ఉంటుంది. ఈ కాటా ద్వారా సుమారు 20వేల టన్నులకు పైగా ప్రతి ఏడాది సరఫరా చేసేవారు. చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో నగదు జమ కాకపోవడం, చెరకు సాగు గిట్టుబాటు కాకపోవడంతో చెరకు సాగుపై రైతుల ఆసక్తి చూపించకపోవడంతో ప్రస్తుతం 10వేల టన్నుల వరకు సరఫరా అయ్యే పరిస్థితి ఉంది. అయితే క్రషింగ్ ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా నేటి వరకు ఈ కాటా నుండి 2000 టన్నుల చెరుకు కూడా సరఫరా కాలేదు. రైతులు పర్మిట్లు తీసుకోవడం, చేసిన చెరుకును కాటాల వద్దకు చేర్చడం, అక్కడ వారాల తరబడి ఉండిపోయి ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుచ్చయ్యపేట కాటా నుండి మరో 8 వేల టన్నుల వరకు చెరకు సరఫరా కావాల్సి ఉంది. అయితే యాజమాన్యం నిర్లక్ష్యంతో కాటాకు సక్రమంగా లారీలను కేటాయించకపోవడంతో చెరుకు నిలిచిపోయి ఎండిపోతుంది.

సహకార రంగంలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి ఇలా ఉండగా.., పాలకొండ, సంకిలి తదితర ప్రైవేటు ఫ్యాక్టరీలకు మండలంలోని రాజాం కేంద్రంగా ప్రతిరోజు 10 నుండి 12 లారీల చెరకు సరఫరా అవుతుంది. సహకార రంగంలో నడిచే గోవాడ ఫ్యాక్టరీ వెలవెల పోతుండగా.. ప్రైవేటు ఫ్యాక్టరీలు మాత్రం కళకళలాడుతున్నాయి. గోవాడ ఫ్యాక్టరీకి పాలకవర్గం లేకపోవడం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కనబడుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని ఫ్యాక్టరీని గాడిలో పెట్టాలని రైతుల కోరుతున్నారు.



వైఎస్.జగన్‌తో కరచాలనం చేస్తున్న పైల శ్రీనివాసరావు

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన పైల

ప్రజాశక్తి-పరవాడ : శ్రీకాకుళం పర్యటన భాగంగా విశాఖపట్నం విమానాశ్రయనికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలకు వైసిపి ప్రభుత్వం ఎప్పుడు అండగా జగన్ చెప్పినట్లు పైలా తెలిపారు.

జగన్‌ను కలిసిన జియ్యాని శ్రీధర్

వేపగుంట : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ పర్యటన అనంతరం విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్న జగన్మోహన్‌రెడ్డిని శ్రీధర్ సత్కరించి చిరు జ్ఞాపికను అందించారు. కూటమి ప్రభుత్వం నగరంలో ప్రధాన సమస్యలుగా ఉన్న పలు అంశాలపై జగన్‌తో చర్చించనట్లు శ్రీధర్ తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తాగునీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మూలపేట గ్రామంలో జల జీవన్ మిషన్‌కు సంబంధించిన కాంట్రాక్టర్ నిరక్ష్యం వల్ల సుమారు 2 నెలలుగా 10 కుటుంబాలకు తాగునీటి సరఫరా నిలిపివేసినట్లు సత్యనారాయణపురం గ్రామాభివృద్ధి కమిటీ కన్వీనర్ కోన లక్ష్మణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ నర్సింహారావుకు గ్రామస్తులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయం పై పంచాయితీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలు మార్లు విన్నపం చేసిన పరిష్కారం కాలేదన్నారు. జల జీవన్ మిషన్ కాంట్రాక్టర్లు ఫోన్ చేస్తే నిరక్ష్యం సమాధానం చెప్పుతున్నారని తెలిపారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉప్పిలి అప్పల కొండ, పల్లా శ్రావణి, గౌరీ, లక్ష్మి, నరసింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్వేయరు డిప్యూటేషన్ రద్దు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామ సచివాలయం సర్వేయర్ వసంత రెడ్డి డిప్యూటేషన్‌ను అధికారులు రద్దు చేశారు. వసంత రెడ్డిని ఇటీవల అధికారులు కసింకోట మండలానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. దీంతో సర్వేయర్ డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆ గ్రామ ప్రజా ప్రతినిధులు కోరారు. దీంతో డిప్యూటేషన్‌ను రద్దు చేసి యధావిధిగా రాజాం సచివాలయానికి నియమించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కుంభమేళాకు వెళ్లిన భరత్ కుటుంబం

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ దంపతులు, ఆయన సోదరుడు మలసాల కుమార్ రాజా దంపతులు గురువారం సాయంత్రం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభ మేళాకు హాజరై పుణ్యస్నానాలు ఆచరించారు.



ప్రయాగ్‌రాజ్‌లో స్నానం ఆచరిస్తున్న భరత్‌కుమార్ కుటుంబం

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-యలమంచిలి

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయని పరవాడ డిఎస్‌పి వల్లెం విష్ణుస్వరూప్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం యలమంచిలిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రూరల్ పోలీస్టేషన్ నుండి గాజువాక బైపాస్ రోడ్డు వరకూ జరిగిన బైక్ ర్యాలీలో డిఎస్‌పి పాల్గొని హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని, అందులో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు ప్రాణం కోల్పోతున్నారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సిఐ జనార్ధన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటుబెల్టు తప్పని సరిగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ బి రామకృష్ణ, టౌన్ ఎస్ఐ సావిత్రి, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కశింకోట సీఐ అల్లు స్వామినాయడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మండలంలో వున్న ఆటో డ్రైవర్లుకు రోడ్డు భద్రతపై అవగాహన గురువారం కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై వచ్చి వాహనాలు రోడ్డు మార్జన్ పాలో అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



రహదారి భద్రతా ర్యాలీలో పాల్గొన్న పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్ తదితరులు

ఘనంగా పండగ మహోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి విజయరామరాజుపేటలో శ్రీమరిడిమాంబ అమ్మవారి పండగ మహెూత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా కమిటీ వారి ఆహ్వానం మేరకు సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి, ధర్మకర్తలు దొడ్డి భరత్ సూరిశెట్టి బల్లమ్మ, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కేకే వి ఏ నారాయణరావు, భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి 82వ వార్డు అధ్యక్షులు పోలవరపు త్రినాధ్, శ్రీహేమగిరి సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పూడి త్రినాథ్, ఆకుల నానాజీ, కొయిలాడ గణేష్, కమిటీ సభ్యులు ఆళ్ల సూర్య రామకృష్ణ, పిల్లా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి మండలం దిబ్బపాలెంలో శ్రీ మరిడితల్లి అమ్మవారి జాతర జరిగింది. అమ్మవారిని ఎపి రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, బుద్ద మహేష్, కండ్రేగుల కేశవ, చదరం నాగేశ్వరావు, మల్ల సత్యనారాయణ, ఆళ్ల సత్తిబాబు, బుద్ద గోవింద, మల్ల రాము, పీలా జయకృష్ణ, మల్ల రాకేష్, దాడి జగన్, ఆకుల నానాజీ, వేగి కృష్ణ, కర్రి నాయుడు, ఎస్.భానుచందర్ (అఖి), జొన్నాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారంలో శ్రీకనకదుర్గ అమ్మవారి పండగ మహెూత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం కాళికామాత అమ్మవారి వేషాలు, తీన్మార్, డప్పులు, తప్పెడు గుళ్ళు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఘటాలతో షాము గరిడిలు, చిటికెల భజనలు, మహిళా కోలాటాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, చలువ పందిళ్ళు వంటి సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అక్కిరెడ్డి దుర్గి నాయుడు, గొంతిన పైడిరాజు, బొబ్బరి కన్నారావు, కోన సత్యనారాయణ, అక్కిరెడ్డి పెద చిన్నోడు, చిన్నం నాయుడు సియ్యాద్రి లక్ష్మణ రావు, శీరం అప్పలరాజు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, పిబివిఎస్ఎన్ రాజు, కర్రి కనకరాజు, కర్రి నర్సింగరావు, కోరాడ శ్రీను, టి.శేఖర్, బంతికోళ్ల పద్మ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : రైతులందరూ విధిగా తమ భూముల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని అనకాపల్లి అగ్రికల్చరల్ సబ్ డివిజన్ ఏడిఏ ఎం.రామారావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి, సబ్బవరం, తవ్వవానిపాలెం గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ ఈనెల 25 లోపు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ భూమి వివరాలు, 1బి, ఆధార్, ఫోన్ నెంబర్లను ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మండలంలో 8300 మంది అర్హులైన రైతులు ఉండగా 4400 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయడమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బాలరాజు, విఏఏలు భావన శ్రావణి, కిషోర్, తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామి నాయుడు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

కారిడార్ పనులను పరిశీలించిన కలెక్టర్

- నిర్వాసితుల సమస్యలపై వైసిపి, సిపిఎం నేతల వినతి



వినతిపత్రం ఇస్తున్న వైసిపి, సిపిఎం నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. వేంపాడు రెవెన్యూ పరిధిలో అమలాపురం ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో నిలిచిన సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి సేకరించిన భూమి, నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం కారిడార్ భూముల్లో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులపై కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ చేపడుతున్న పెద తీనార్ల ప్రాంతాన్ని, నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు గుర్తించిన పెదబోదుగల్లం వద్ద స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం సిద్ధంగా ఉందన్నారు. అదనంగా మరో వెయ్యి ఎకరాలు సేకరిస్తున్నామన్నారు. జిరాయితి భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించారని, డి పట్టా, సాగు భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించకపోవడంతో సాగుదారులు పరిహారం కోసం ఎదురుచూసున్నారని అడగ్గా, పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ వివి రమణ, తహసిల్దార్ నరసింహమూర్తి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజేంద్రరెడ్డి, ఆర్ఐ కన్నబాబు, సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, డి ఎల్ పురం మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ వినతిపత్రం అందజేశారు. కారిడార్ భూములు, రోడ్డు పనులు పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌కు నిర్వాసితుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన వారికి 25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరహారం వెంటనే చెల్లించాలని,ఢి ఫారం, సాగు భూములలో తోటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేయ వద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరేడుబంద రోడ్డు నిర్మాణానికి అనుమతులు జారీ

-అటవీశాఖ చోడవరం రేంజ్ అధికారి రవివర్మ
-ఫలించిన వామపక్షాల పోరాటం



ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారులో మూడు కొండల మీద ఉన్న నేరేడు బంద గ్రామానికి రహదారి సౌకర్యం త్వరలో నెరవేరనుంది. రహదారి నిర్మాణానికి ఇప్పటి వరకు అభ్యంతరం వ్యక్తం చేసిన అటవీశాఖ రహదారి నిర్మాణానికి పచ్చ జెండా ఊపింది. గత కొన్నేళ్లుగా సిపిఎం, సీపీఐ, గిరిజన సంఘాల పోరాటానికి ప్రతి ఫలం త్వరలో దక్కనుంది. ఈ మేరకు రహదారి నిర్మాణానికి అనుమతులు జారీ చేసినట్టు అటవీశాఖ చోడవరం రేంజ్ అధికారి రవివర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అటవీ శాఖ పరిధి ఏరియాలో రహదారి నిర్మాణానికి గతంలో రూ రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయన్నారు. నిర్మాణానికి అనుమతులు కావాలని కోరగా సర్వే సిబ్బందితో పూర్తిగా పరిశీలించడం జరిగిందన్నారు. గతంలో ఆ ఫారెస్ట్ పరిధిలో వెదురు తరలించేందుకు వాహనం నడిచే రహదారి ఉండేదని, ఇప్పుడు మరలా రహదారి నిర్మాణం చేపడితే అటవీ శాఖకు ఎటువంటి నష్టం వాటిల్లదని ధ్రువీకరిస్తూ డిఎఫ్ఎకు నివేదిక సమర్పించామన్నారు. ఆ నివేదికను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదించి నట్టు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ సానుకూలంగా తగు చర్యలు తీసుకుంటారన్నారు.

ఇదిలా ఉండగా చీమలపాడు శివారు జోగంపేట నుంచి మూడు కొండలు దాటి జి.మాడుగుల మండలం సరిహద్దులో ఉన్న ఆదివాసీ గిరిజన గ్రామంలో సుమారు 15 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తు న్నారు. వారికీ రహదారి సౌకర్యంతో పాటు ఎటువంటి మౌళిక సదుపాయాలు లేవు. ఎన్నికల సమయంలో ఓట్లు వేయించు కోవడానికి మినహా మిగతా సమయంలో ఆ గ్రామాన్ని పట్టించు కున్న సందర్భాలు లేవు.. దీనిపై పలు మార్లు వామపక్ష పార్టీలతో పాటు గిరిజన సంఘాల నాయకులు మండల, జిల్లా కేంద్రాలలో నిరసనలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఫారెస్ట్ శాఖ ను అప్రమత్తం చేశారు.దీంతో ఆ గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టేందుకు మార్గం సుగమం అయ్యింది.



రికార్డులను తనిఖీ చేస్తున్న వెంకటరావు

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సి హెచ్ వెంకటరావు సూచించారు. గురువారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఎక్కువమంది విద్యార్థులను సభ్యులుగా చేర్పించాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్‌కు సూచించారు. ప్రహరీ గోడకు పెయింటింగ్ వేయిం చాలన్నారు.

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - చింతపల్లి : క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, సకాలంలో మందులు వాడితే నయం అవుతుందని స్థానిక క్షయ వ్యాధి సూపర్వైజర్ ప్రసాద్ అన్నారు. యాంటీ టీ బి వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలుర ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత,ూ మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు



రావికమతంలో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రజాశక్తి -రావికమతం: అంగన్ వాడీలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ బ్రహ్మాజీ తెలిపారు. మండలకేంద్రంలోని హైస్కూల్లో మూడవరోజు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులలో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు వివరించాలన్నారు. కృత్యాలు, డెమో ప్రదర్శనతో పాటు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ పై అవగాహన కల్పించారు. మరో మూడు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు రాజేశ్వరి, సరోజినీ, రిసోర్స్ పర్సన్లు వేదవతి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలని మెడిటేషన్ రిసోర్స్ పర్సన్ అప్పారావు సూచించారు. మండలంలో మూడు రోజులు పాటు సాగిన అంగన్వాడి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు.చిన్నారులకు పద్యాల ద్వారా ఏ విధంగా విద్యాబోధన చేయాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి : అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలో కలపడం జరుగుతుందని అనకాపల్లి జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్లో భాగంగా గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 6 రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడబ్ల్యుడి కేంద్రాల్లో పిల్లల ఎన్రోల్మెంట్ పెంపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ మురళి మనోహర్ పట్నాయక్, ఏసిడిపిఓ ప్రభావతి, ఎంఇఒ ఎస్ కోటేశ్వరరావు, ఆర్‌పిఎస్ మోహన్‌కృష్ణ, ఉమామహేశ్వరరావు, సిఆర్పిఎస్ శంకర్రావు, పద్మజ, దేవి, తులసి, నీలవేణి పాల్గొన్నారు.

సీతమ్మధార : మాధవధారలోని జివిఎంసి ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి సమగ్ర శిక్షణ తరగతులను సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. తొలి దశలోనే పిల్లలకు విద్యలో బలమైన పునాది వేయడం ద్వారా ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ రమణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెటిరో సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మార్చి 3వ తేదీన జాతీయ రక్షణ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 17న మండలంలో పలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో రాణించిన విద్యార్థులకు మండల స్థాయిలో విద్యార్థులకు గృహోపకరణాల వినియోగంలో భద్రతా ప్రమాణాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు, రహదారి భద్రత అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 60 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఎంఈఓ నరేష్, హెచ్‌ఎం సుందరరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, నీలకంఠకుమార్, గుణావతి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.



నమోదు చేస్తున్న ఎఒ

వడపర్తిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని వడపర్తి గ్రామంలో గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి కే.సుధారాణి ఫార్మర్ రిజిస్టర్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, గడువు లోపు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

23న పోతురాజుబాబు జాతర

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని శరభవరం గ్రామంలో ఈ నెల 23న పోతురాజుబాబు జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు పంచాడ చంద్ర తెలిపారు. అదే రోజు రాత్రికి బాలు రైడర్స్ ఆధ్వర్యంలో డాన్స్‌బేబి డ్యాన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్

పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న భవనాన్ని గురువారం మండల తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్నలు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌లు నాగరాజు, కొండబాబు, విఆర్వోలు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు



స్నాన ఘట్టాలను పరిశీలిస్తున్న స్పీకర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 26 నుంచి జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ప్రాంతంలోని స్నాన ఘట్టాలు, పరిసరాలను స్పీకర్ పరిశీలించారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ గోవిందరావుకు సూచించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ,నర్సీపట్నం ఉత్తర వాహినిని దక్షిణ కాశీగా పేరొందిందని, ఇక్కడ స్నానాలు ఆచరించి , శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. 2018లో భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశామని, గంగా హారతిని కూడా ప్రారంభించామని గుర్తు చేశారు. 26వ తేదీ సాయంత్రం గంగా హారతి, 27న ఉదయం అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బ్రహ్మ లింగేశ్వర స్వామి స్థల పురాణం వీడియోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రించాలి

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును గురువారం అనకాపల్లి జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రైమ్ రేటు తగ్గేలా సమర్థమైన చర్యలు తీసుకోవాలని స్పీకర్ సూచించారు. గంజాయి అక్రమ రవాణా పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని, గంజాయి ముఠాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అతివేగంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అతివేగాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో క్రైమ్ సీఐ అప్పలనాయుడు, టౌన్ సీఐ గోవిందరావు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఉద్యోగులు

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రపంచ భీమా రంగంలో అగ్రగామిగా నిలిచిన ఎల్ఐసి సంస్థలో శాశ్వత ఉద్యోగులను నియమించాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం సభ్యులు, ఐసీఈయు బేస్ యూనిట్ స్థానిక ఎల్ఐసి కార్యాలయం ముందు గురువారం ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కంకిపాటి కేశపత్రం పడాల్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయి బీమా సంస్థల్లో అవార్డులు పొందిన ఎల్ఐసి సంస్థ దేశానికి వెన్నెముకంగా నిలిచిందన్నారు. ఇటువంటి ఎల్ఐసి సంస్థలో శాశ్వత ఉద్యోగాలు నియమించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఏ సంస్థకైనా శిక్షితులైన సిబ్బంది ప్రధాన భూమిక పోషిస్తారని తెలిపారు. ప్రపంచీకరణ, సరళీకరణ పరిణామాలతో అవుట్సోర్సింగ్ పెరిగి పోతోందని తెలిపారు. సరైన విద్యార్హతలు కలిగిన ఉద్యోగులను క్రమం తప్పకుండా నియమిస్తూ ఉండడంతో సంస్థ దినదినాభివృద్ధి సాధించగలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఓ నాయకులు శ్రీరామ్‌మూర్తి, వి.చిన్నయ్య, ఎస్సీ ఎస్టీ జిల్లా నాయకులు ఎస్ ధనార్జన్ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

వెంకన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి- నక్కపల్లి: ప్రాచీన పుణ్య క్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను టిటిడి ఇంజనీరింగ్ విభాగం అధికారులు గురువారం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. హోం మంత్రి వంగలపూడి అనిత స్థానిక నాయకులతో కలిసి తిరుపతిలో టిటిడి పాలక మండలి చైర్మన్‌తో సమావేశమై ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచాలను కోరుతూ వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు చైర్మన్ ఆదేశాల మేరకు టీటీడీ ఎస్ఇ జగదీశ్వర్ రెడ్డి, ఈఈ సురేంద్రనాథ్‌రెడ్డి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొండపైకి రోడ్డు మార్గం, పుష్కరిణి అభివృద్ధి, కళ్యాణ మండపం, గెస్ట్ హౌస్‌లు, డార్మెటరీ తదితర నిర్మాణ పనులు చేపట్టేందుకు గాను నివేదికను టిటిడి అధికారులకు అందజేస్తామని ఏఈ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిటిసిలకు గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -హుకుంపేట: 20 నెలల ఎంపీటీసీల గౌరవ వేతనం బకాయి విడుదల చేయాలని ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా గురువారం చేపట్టారు.ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ, ఎంపీపీలు తిరగడానికి వెహికిల్ అలవెన్స్ ఇవ్వలేదన్నారు. ఎంపీటీసీలకు గౌరవేతనం మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ఎంపీపీ, ఎంపీటీసీలకు సర్పంచ్లకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లు శెట్టి మహేష్, భీమలింగేశ్వర రావు, సంబాయి కొండమ్మ, కోరాబు నాగ లక్ష్మీ, కిల్లో మీనా,నైని రజని, సాంబే బాలకృష్ణ, కొర్ర నాగ రాజు, కోరాబు వెంకట్ పాల్గొన్నారు.

కక్ష రాజకీయాలు తగవు

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కక్ష రాజకీయాలు విరమించి, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇన్చార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ కుమారుడు మక్సుద్ అహ్మద్ వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ ను ఆసీలుమెట్ట కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, వైసిపి సరికొత్తగా మంచి వ్యక్తులను ఎంపిక చేసి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం ఆనందదాయకమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ వర్గానికి కూడా ఇప్పటివరకూ న్యాయం చేయలేకపోగా, వారి ఇచ్చిన సూపర్ సిక్స్ లాంటి ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారన్నారు. జగన్మోహన్ రెడ్డి పేదలకి, మధ్య తరగతి ప్రజలందరికీ అనేక సంక్షేమ పథకాల అందించి, విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తూ అనేక ఆసుపత్రి నిర్మాణాలు, యూనివర్సిటీలు నెల కొల్పారన్నారు. వాటన్నిటిని తుంగలో తొక్కుతూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. తప్పులను సరిదిద్దుకుంటూ సరికొత్తగా పార్టీని ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా, శ్రీకాకుళం జిల్లా పలాస వెళ్లేందుకు విమానంలో వచ్చిన వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ వాసుపల్లి గణేష్ కుమార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో కాసేపు చర్చించారు.

మెగా డిఎస్సి ప్రకటించాలి

- ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: తక్షణమే మెగా డిఎస్సీ విడుదల చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్ డిమాండ్ చేశారు. గురువారం అల్లిపురం లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలో వచ్చి 8 నెలలు గడుస్తున్నా మెగా డిఎస్సీ విడుదల చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు రూపాయలు కోచింగ్ సెంటర్లకు వెచ్చించి ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు.మెగా డిఎస్సీ అభ్యర్థుల విషయంలో గత ప్రభుత్వం డిఎస్సీ ఇస్తామని చెప్పి మోసం చేసిందని,తాము అధికారం రాగానే మెగా డిఎస్సీ విడుదల చేస్తామని మోసపూరిత హామీ ఇచ్చి, ప్రకటనలకే పరిమితం అయ్యారని ఆరోపించారు. విశాఖ ఉక్కుని ప్రభుత్వ రంగంలో కొనసాగించి,రాయలసీమ కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధి కారి వై.రాంబాబు,ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు వి.రాజు, కన్నబాబు, వాసు, కిరణ్ ,కెంగువ అచ్యుత్ నాగరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

-జిల్లా క్రైమ్ అదనపు ఎస్పి మోహన్‌రావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మోహనరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీ పట్నంలోని ఆటో యూనియన్ ససభ్యులకు టౌన్ స్టేషన్ వద్ద జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా రోడ్లు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముందు సీట్లలో ప్రయాణికులను కూర్చో బెట్టరాదని, ఓవర్ లోడింగ్, అదనపు ప్రయాణీకులను తీసుకెళ్లడం, ర్యాష్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్‌లలో మాట్లాడ రాదన్నారు. నిషేధిత ప్రాంతాలలో అక్రమ పార్కింగ్, ప్రయాణీకుల నుండి అదనపు మొత్తాన్ని వసూలు చేయరాదన్నారు. అనంతరం డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆటోలకు కొన్ని పోస్టర్‌లను అతికించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని గొలుగొండ ఎస్సై పీ.రామారావు సూచించారు. గురువారం మండలంలోని ఆటో యూనియన్ సభ్యులతో, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఓవర్ లోడింగ్ చేయరాదని చెప్పారు. అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మందిని ఆటోలో తీసుకు వెళ్ళకూడదని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా, వినయంగా మాట్లాడాలని చెప్పారు.